# మూలాలు

జీవిత భీమా డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాజరాంకు నలుబదేళ్ళుంటాయి. తన వృత్తితో మంచి నేర్పరి. పట్టణంలో జరిగె సాంస్కృతిక, సామాజిక కార్యాకలాపాల్లో చురుకుగా పాల్గొంటు వుంటాడు. అంబేడ్కర్ ఆలోచనలు దేశప్రగతికి మార్గాలు అంటు సభలు, సెమినార్లు నిర్వహిస్తువుంటాడు మంచికార్యశీలి.

ఆఫీసునుండి వచ్చి వరండాలో ఫ్రంట్‌లైన్ పత్రిక చూస్తుకూర్చున్నడు. స్కూల్ నుండి ఆదావుడిగా వచ్చి పుస్తకాల బ్యాగ్‌ను లోపల పడేసి, ఏదోచెప్పాలని తండ్రి ముందుకొచ్చి నిలుచుంది. మ్యాగజీన్ నుండి దృష్టి ఆమె వైపు మరల్చుతు..

" చెప్పమ్మ "

" మా క్లాస్‌లో ఏం జరిగిందో తెలుసా" అంది కాన్‌వెంట్‌లో తొమ్మిదవ తరగతి ఇంగ్లీషు మీడియం చదువున్న రజని. తల్లి రూపం, తండ్రి తత్వం ఆ అమ్మాయిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నయి.

" నీవు చెప్పిందే ఎలా తెలుస్తుంది "

తన పెద్ద పెద్ద కనుగుడ్లను మరింత పెద్దవిచేస్తూ, చూపులను తండ్రి ముఖం మీద నిలుపుతు–

" మీలో ఎస్సీలు ఎవరో నిలుచోండి. " అంది మాటీచర్.

" నీవు నిలుచున్నావా? "

" లేదు " అంది

" ఎస్సీలు అంటే " అని అడిగింది అదో మాదిరిగా చూస్తు.

" ఎనిమిదో తరగతి తెలుగు వాచకం చదినవు కదా? అందులో డా॥ అంబేడ్కర్ అని ఓ కవిత పాఠంగా వుందా?"

" ఆ. వుంది "

" ఆ అంబేడ్కరే మన రాజ్యాంగాన్ని కూర్చింది"

" మా టీచర్ కూడా చెప్పారు"

" అంబేడ్కర్ సమాజంలో అణిచివేయబడ్డ పేద వాళ్ళకు, రాజ్యాంగములో కొన్ని రక్షణలను కల్పిస్తు ఓ జాబితా తయారు చేసాడు. ఆ జాబితాలో పొందుపరిచిన కులాలే షెడ్యూల్డ్ కులాలు. షార్ట్‌గా ఎస్సీలని పిలుస్తారు టూకీగా అన్నడు.

అదా సంగతి అన్నట్టు మౌనంగా చూసింది.

" ఓ పనిచేయి, సెలవుల్లో చుట్టుపక్కాల ఊళ్లకు వెళ్ళిరా అన్నీ తెలుస్తాయి." అన్నడు రాజారాం.

*

" జానకి ఎవరొచ్చారో చూడు " అన్నడు రాజారాం వరండాలో కూర్చొని. వంటింటి నుండి తొంగి చూసింది రాజారాం భార్య జానకి.

పూలపరికీన్, అదె పూల జాకెట్‌తో ఇంట్లోకి వస్తున్న రజని చూడగానె ఆమె ముఖం మీద నవ్వుపూసింది. తలలో తంగెడిపూవు. చేతిలో కందికాయలమండ. అచ్చం పల్లెపిల్లలాగుంది. జానకి కాసేపు ముక్కుమీద వేలుంచి ఆ తరువాత " " అంతా బాగేనా అమ్మ" అంటు ఎదురు వెళ్ళి తల్లి చేతిలోని సంచిని తన చేతిలోకి తీసుకుంది.

' అంతా బాగానేవున్నరు ' అన్నట్టు తలాడించింది.

" చూసావా అమ్మ తన తల్లినే పలకరించింది కాని నన్ను పలకరించలేదు చూడు " అంటు తండ్రి కూర్చున్న వైపు నడిచి రొండిన రెండు చేతులుంచి నిలుచుంది రజని.

" నిన్ను పలకరించాదానికి నేనున్నాగా, ముందు కాళ్లు-చేతులు కడుక్కొనిరా" అన్నడు తండ్రి.

" చెప్పుల స్టాండుపై చెప్పులుంచి, కాళ్లు-చేతులు కడుక్కొని టవల్‌తో తడిని తుడ్చుకుంటు వొచ్చి తండ్రి ఎదురుగ కూర్చుంటు.

" అన్నయ్యెక్కడ "

" బయట ఎక్కడో " అంటు చేతిలోని పేపర్‌ను పక్కకు పెట్టి అప్పుడే వచ్చేసినవు ఇంకో రెండు రోజులుండి రావలసింది"

" అబ్బో ఆఊళ్లల్లో ఉండలేం నాన్న. ఆ ఇరుకు సందులు ఇండ్ల చుట్టు కంపచెట్లు"

" ఊళ్లు అట్లనె వుంటయిమరి. అవును ఈడ్రస్ నీకు బాగుందె " అన్నడు తండ్రి చిరునవ్వుతో

" బాగుండదుమరి మీ చెల్లెలు కుట్టించిందాయే, " అంది కొంచెం వెటకారంగా, కనుగుడ్లను అటుఇటు తిప్పుతు

" చిన్నప్పుడు మా చెల్లె ఇట్లనే వుండేది"

" మీ చెల్లెలాగున్ననా? అంత నల్లగ వున్ననా?" అంది ఆశ్చర్యం ప్రకటిస్తు.

" సరె నీవు మా చెల్లెకంటె బాగానే వున్నవులే. సబ్బుతో స్నానాలు, నీడపట్టు బతుకులు వుంటె ఆమె మీ రంగులోనే వుండేది." అన్నడు నింపాదిగా

చూస్తు. చిన్నప్పటి తన చెల్లెలును గుర్తుచేసుకుంటు.

" ఎస్సీలు చాలా మంది నల్లగా ఉంటరు ఎందుకు నాన్న."

" నిజమే నల్లగనే ఉంటరు. దక్షిణాది వాళ్లంతా నల్లగనే ఉంటరు. వీళ్లే అసలు మూగవాసులు. రాత్రింబగలు ప్రకృతిలో పని చేసే శ్రమ జీవులంతా అర్ధనగ్నంగానే ఉంటు వచ్చారు. ముస్ముందు చరిత్రను చదువుతున్నప్పుడు నీకే తెలుస్తుంది అన్నడు.

*

" అమ్మమ్మ వాళ్ళ ఊరు ఎలా చేరినవు " అడిగిండు రాజారాం కూతురును.

అమ్మమ్మ వాళ్ల వూరికి డైరెక్టుగా బస్సులేదు పక్కన్నె వున్న మండలంలో దిగి అక్కడినుండి ఆటోలో ఊరు చేరి, ఊరి మధ్యలో దిగి, అమ్మమ్మోళ్ల ఇంటివైపు నడుస్తువుంటే ఆవూరి వాళ్లంతా మిమ్ములను అమ్మను అడుగుతు ప్రేమగా పలకరించారు. ఎవరు చెప్పారో ఏమో అమ్మమ్మ ఎదురొచ్చి బుగ్గలను తడుముతు, తీసుకెళ్ళి జాలారీలో కాళ్లు-చేతులు కడిగింది. కొంగుతో తూడిచింది. కుశల ప్రశ్నలతో ఆమె ముఖంలో ఆనందం మాటల్లో తృప్తి. సాయంత్రం కిరాణకొట్టుకు తీసుకెళుతు దారిపొడుగుతా అందర్కి నా గురించి నాచదువు గురించె చెపుతు నడిచింది.

ఎప్పుడో సర్కారువాళ్లు కట్టించిన రెండు గదుల ఇల్లు. అది ఒకవైపు గోడకూలిపోతె మళ్లీ మట్టితో సరిచేసారు. ఆ సరిచేసిన దగ్గర పెరిగిన పెద్ద పుట్ట. అసలు ఆ ఇంటిని చూస్తెనే భయం. ' ఏపుట్టలో ఏ పాముందో ' సామెత గుర్తొచ్చింది. అదె ఇంటి గోడకు కమ్మలతో జారుడుగ కప్పిన పాక. అందులోనే వంటచేసేది.

అమ్మమ్మ పిలువగానె పరుగెత్తుకొచ్చె పందులు. అవి కుడితి తాగడానికి వాకిట్లోనే చిన్నతొట్టి. దానిచుట్టు పడ్డ గింజలను ఏరుకుతినే కోడిపిల్లలు. అవి అమ్మమ్మకు అసరారాబడిని తెస్తాయట. ఇంటివైపు పురుగుబుసి వస్తే ఆ కోడిపిల్లలు అరుస్తాయట.

పొద్దంతా పనికిపోయి మామయ్య అత్తయ్య దీపాలు ముట్టించేవేళ్లకొచ్చారు. అత్తమ్మ నెత్తిన కట్టెమోపు. మామయ్య బుజాన పచ్చితాటిమట్టలు. వాటి నారతో తాళ్లు పేనుతడట. పలకరింపుల తరువాత వాకిట్లో ఇరుగుపొరుగువాళ్లు కంచాలతో (ఇప్పటి బఫే డిన్నర్) అక్కడికి వచ్చి తినుకుంటు ముచ్చట్లు. అలిసిన ప్రాణాలు కదా ఆతరువాత ఎవరి

ఇంటిముందు వాళ్లు మెల్లగా ఈతచాపలు పరుచుకొని నిద్రపోయారు.

వెన్నెల రోజులు. వాకిట్లో నులకమంచంమీద అమ్మమ్మ బొంత పరిచింది. ఆ బొంత వింత వాసనగవుంది. తల దగ్గర కాటన్ టవల్ పరుచుకున్న. మాటిమాటికి పుట్టే గుర్తుకువస్తు ఆరాత్రి సరిగా నిద్రపట్టలేదు. పోగా ఈగల్లాంటి దోమలు

మధ్యరాత్రి పుట్టలోనుండి ఓ పెద్దపాము బయటికొచ్చి సూరువారగా పాకుతువుంది. కళ్లను కాసేపు అట్టాగె తెరిచివుంచి చూస్తువుండి పోగా, చల్ల చెమటలు పోసినయి. రెప్పకొట్టకుండా చూస్తు వుంటే తేల్సింది అది చూరుకు అడ్డంగ వేలాడతీసిన దండెపు వెదురు బొంగని. అప్పుడు ఎండ వాన కలిసొచ్చినట్టు సిగ్గు, నవ్వు వచ్చినయి.

తెల్లవారినాక కాలకృత్యాలు తీర్చుకోవటం కోసం ఊరిబయటవున్న కంప చెట్లలోకి వెళ్ళవల్సి వచ్చింది. ఆ ఊరి ఆడవాళ్లందర్కి అదె చోటు. వచ్చిపోయే ప్రతి మగ మనిషికి లేచినిలుచోవడం తప్పని పరిస్థితి. స్నానం చేయడం జాలారీలోనే. చుట్టు కమ్మలదడి దానికో తాటికొమ్మ అడ్డం అంతె. ఒక అమ్మమ్మ వాళ్ల సంగతెకాదు ఆవాడంతా అంతె. నేను మూడవ తరగతి చదివె రోజుల్లో వచ్చినపుడు బొగ్గుతో పళ్లు తోముకునేవాళ్లు. ఇప్పుడు కొంచం నయమే కొందరు ముఖం పుల్లలు వేసుకుంటె కొందరు బ్రష్‌ను వాడుతున్నరు. చేసేకూలి బట్టపొట్టకే సరిపోదట. ఎప్పుడు రోగాలు నొప్పులకు తప్పని అప్పులట, ఎంతైన పేదరికపు బతుకులు అద్వాన్నపు బతుకులే. దుమ్ము దూలి అంతా వీళ్ళ వంటిమీదే.

తెలిసిన వాళ్ళ ఇళ్లకు వెళ్ళి చిన్నప్పటి స్నేహితురాళ్లను పలకరిస్తే అందరు ఏదో పనిచేస్తువున్నరట. అంత చిన్న వయసులో ఒక్కరిద్దరు పెళ్ళీలు కూడా చేసేసారు. బడిమానిపించి జీతాలకు రోజు కూలికి పంపించి పూట ఎల్లతీస్తున్నరు. ఇదంత చూసి నాకు అక్కడ వుండబుద్ధికాలేదు. అమ్మమ్మను తీసుకుని మేనత్త ఊరికి ప్రయాణం.

*

గట్లు పుట్టలు, చెట్లు, చేమలు దాటి మేనత్తవాళ్ళ ఊరుచేరేసరికి ఊరి బయట చెట్టుకింద జనం గుంపుగ చేరి వాదోపవాదాలు చేస్తువున్నరు. చింత చెట్టుకు ఓ యువకున్ని తాళ్లతో కట్టేసారు. కొద్ది దూరంలో రాళ్లగోడ పక్కన ఓ యువతి తలవంచుకొని నిలుచుంది. దు:ఖంతో కదులుతున్న ముక్కు పుటలు. మేం ముందుకు కదిలినం.

" ఏం జరుగుతుంది అమ్మమ్మ "

" ఏదో తప్పు జరిగితే చిచ్చిస్తున్నట్టు వుంది "
" మరీ పోలీసులేరి "
" ఊరిపెద్దలె ఆపనిచేస్తువున్నరు " అంది
" అట్లా చేయోచ్చా " అంటున్నపుడే బట్టల మూటతో ఎదురైన ఒక ఆమెను అమ్మమ్మ ఆపి " ఎందట రామక్క " అని అడిగింది. పేరు పెట్టి పిలిచిందంటె ఇంతకు ముందె ఆమె అమ్మమ్మకు తెలుసట్టుంది.
" ఏముంది గదె " అంది రామక్క
" ఆ అదె ఎందో నాకర్థం కాక ఇంకేంచెపుతుందో అని ఆమె ముఖంలోకి చూస్తువున్న"
" కులంగాని కూడుతిన్నరు" అంది తత్వం చెప్పినట్టు.
" ఆమె కాపోలపిల్ల. పెండ్లి పెడాకులు కాలే. ఓ మాదిగోనికి అలవాటైంది. అక్కడొచ్చింది చిక్కు! కుల పట్టింపుతో ఊరు ఊరంత ఒకటైంది. మాదిగవాడ కాకి వేరే వాడమీద వాలొద్దట. వేరే వాడలమీది కాకి మాదిగవాడ మీద వాలొద్దట." అంది రామక్క మళ్ళీతానే.
" అయితె ఊళ్ళో పెద్ద చిచ్చె లేచింది " అంది అమ్మమ్మ.
" ఈళ్ల నీల్గుడుకాని ఇప్పుడు కులాల పట్టింపు అంతెక్కడిది. వేరే కులాలవాళ్లు మాదిగస్త్రీలనుపోవచ్చు కాని మాదిగలు వేరే కులపు ఆడోళ్లను పోవద్దు. ఇదేం న్యాయమో సాగొచ్చిన చేతలు తప్పా సక్రమైనయికావు. ఎక్కువ కులపోడు తక్కువ కులందాన్ని పోతె రసికత. తక్కువ కులపోడు ఎక్కువ కులం దాన్ని మరిగితే రంకా?" అంది రామక్క " రోజు ఊరంతా తిరిగె ఆమెకు రంకుబొంకుల సంగతి ఎక్కువ తెలుసు" అంది అమ్మమ్మ.
" నాకైతే వీళ్ల మాటల మర్మం తెలవలేదు కాని ఒకటి అర్థమైంది. మనుషుల్లో ఎక్కువ తక్కువ కులాలున్నాయన్న మాట. అందుకె స్కూల్లో ఎస్సీవాళ్లు చేయి ఎత్తాలంది టీచర్' అనుకుంటు ఊళ్లోకి నడిచినం.

ఊరికి దూరంగా మాదిగ వాడ. దానిపక్కమ్మటె మాలవాడ. అత్తమ్మ వాళ్ల ఇంటి ముందె బోరింగ్ పంపుతువుంది. దాని చుట్టూర నీటి మడుగు తయారైంది. అత్తమ్మ మా రాకను చూసి ఎదురొచ్చి బోరింగ్ దగ్గరే కాళ్లు చేతులు కడిగించుకుని
" మీకొడుకు ఆ పంచాయితి దగ్గర్నె ఉన్నడు " అంటు తాటాకుల పందిట్లో వాల్చిన మంచంమీద చద్దర్ పరిచింది.
*
" అమ్మనాన్న అంత బాగున్నారే రజని " ముఖాన్ని తన వల్లోకి తీసుకుంటు

అడిగింది అత్తయ్య.
" అంత బాగే " అన్న. అత్తయ్య దగ్గర అంత చెమట వాసన. తలను పక్కకు జరుపుకున్నా, కాని ఆమె ఆప్యాయత ముందు ఆ వాసన ఓ లెక్క అనిపించలేదు. పోగ చెమట ఉప్పయితదని అప్పుడే తెలిసింది.
మాట్లాడుతూనే వంటింట్లో పీటలేసి అన్నం వడ్డించింది. నాకు కూర్చునే పీటెకాక ముందు ముక్కాలు పీటోటి వుంచి, దానిమీద పల్లెముంచి 'గోంగూరలో ఎండుమాసం ముక్కలేసి వండిన కూర' అంటు నాముఖంలోకి చూసింది.
'నేను ఆ మాంసం తినని తెలుసుగ' అని చేయి అడ్డం పెట్టిన.
" వాళ్లింట్ల మొదటినుండి దానిని వాడరుగ" అంది అమ్మమ్మ తనకు వడ్డించుమన్నట్టు చూస్తు. అత్తయ్య వడ్డిస్తు నావైపు చూస్తు ' రాత్రికి నీకు వేరె కూరచేస్త. ఇప్పుడు పెరుగుతో తిను' అంటు పెరుగు గురిగి ముందుచుంది."
" అత్తమ్మ రజని చాల పొడుగైంది కదూ?" నన్నే చూస్తు అంది అత్తయ్య.
" గోగు కొమ్మలాగె పెరిగింది. కాని కాల్‌రెక్కలు చూడు ఏమన్న బలంగవున్నయా! తల్లి నెత్తి నోరు కొట్టుకున్న తినదాయె"
" తినంది మనిషెట్ల బతుకుతరె ముసలి " గుడ్లురుమ్ముతు అన్న.
" ఏం తిండమ్మ, కొడితిండి " అంది అమ్మమ్మ. కోడి ఎట్ల తింటదో నేను చూడలేదు.
" మాట్లాడకె అత్త. ఆ కాస్త తినదు " అంది అత్తయ్య.
" గురిలో పెరుగు కమ్మగుంటది. స్టీల్ గిన్నెల్లో తోడేస్తే అసలు రుచివుండదు " అంది అమ్మమ్మ. నేను ఎక్కువ తినాలేమో.
ఈలోపు అత్తయ్య పందిట్లో కెల్లి ఏదో శబ్దంచేసింది. మేకలన్నీ వచ్చి చుట్టు చేరినయి. అన్నీటికి నీళ్ల గోలాంలన్ని చూపించింది. ఒకటి తరువాత ఒకటి కడుపు నిండి నీళ్లు తాగినయి. కొన్ని నీళ్ల తాగగానే అక్కడే మూత్రం చేసినయి. నీళ్ల తాగినిలుచున్న మేకల పొదుగుల దగ్గర వాటి పిల్లలు మూతులుంచి, తోకలనాడిస్తు పాలు చీకుతున్నయి. రెండు మూడు మేకల సండ్లకు గుడ్డలు చుట్టి వాటి గొతికలనే దంచి రుద్దిండ్రట. పిల్లలు చీకకుండా ఆపాలను ఇంటివాళ్లు పిండుకుంటరట.
సాయంత్రం మేకలన్ని ఇంటిచుట్టు చేరినయి. రాములు మామయ్య వచ్చి వాటిని ఇంటి పక్కన్నె వున్న దొడ్డిలోకి తోలి తడక వేశాడు. ఓ చిన్న మేక పిల్లను తెచ్చుకొని ఆడుకుంటు ఉన్న రాములు మామయ్య నులకమంచం

అద్దమీద కూర్చోని మన వాళ్లందరి గురించి అడిగి తెలుసుకుంటున్నడు. నీళ్ల బకెట్‌లో చెంబువేసి ‘ అందరు కడుక్కొండి తిందురుగాని” అంది అత్తయ్య లైట్‌వేసి, దానికి దండం కూడా పెట్టిండు.

“ అప్పుడేనా ” అన్న.

“ మీ మామ పొద్దటి నుండి పంచాయితిలో ఉండి తిండె తినలేదు” భర్తవైపు చూస్తు అంది.

“ ఆకరి ఏమాయే. ఈ మేకల జేబట్టి రావటం కుదరలేదు ” అంది అత్తయ్య.

“ ఏమైతది పోలిసోల్లకు ఎవరో చెప్పినట్టుంది వచ్చి పట్టుకుపోయిరి ” అన్నడు మామయ్య.

“ బాగైంది. లేకపోతే తలోమాట తలో దెబ్బ? జరుగకూడది జరిగింది. అయితే ప్రాణాలు తీస్తారా? అంది అత్తయ్య.

“ బాబు వచ్చి పోయిండా?” అడిగింది అమ్మమ్మ మాట మార్చుతు.

“ మొన్న పండుగకు వచ్చి పోయిందత్త ”

“ ఇంకా చదువు పూర్తి కాలేదా ” అమ్మమ్మ ప్రశ్న.

“ ఎక్కడ, ఇప్పుడు పన్నేండేనాయే. ఆ తరువాత ఏం చదువే రజని” అని అడిగింది. అత్తయ్య.

“ ఇపుడు ఇంటర్ ఫైనల్ కదా తరువాత ఆయన ఇష్టాన్ని పట్టి ఉంటుంది.”

“ ఆ చదువు చల్లగుండ. హాస్టల్ చదవని పేరేగాని, ప్రైవేట్ క్లాసులకు పోవడం ఆ చదువును కొనుకుంటున్నట్టె అనుకో” అన్నడు విసుకుగా రాములు మామ.

“ ఆ తరువాత నన్న జోడి కుదురుతదా ” అన్నది అమ్మమ్మ.

“ ఎట్ల రాసివుంటె అట్టయితది. ఆ మధ్య అన్న వచ్చినపుడు ఎల్లదీస్తె మేనరికం మంచిదికాదు అన్నడు” అని గుర్తు చేసింది. “ అమ్మమ్మ ఆ ముచ్చట ఆపేయి ’ అన్న.

“ అంటే పెండ్లే చేసుకోవా ఏంది” అంది అమ్మమ్మ.

“ వొదిలేయత్త దానికి ఇష్టంలేని ముచ్చట్లు ఎందుకు” అంది అత్తయ్య.

ఆ రాత్రి పందిట్లో మామయ్య నాకు నులకమంచం వేసారు. అమ్మమ్మ అత్తయ్య ఇంట్లో పడుకున్నరు. ఇల్లు వాకిలి అంతా మేకల మల మూత్రాల వాసన! మేకపిల్లల అరుపులు! నా మంచం మీద పడుకోబెట్టుకున్న మేకపిల్లను తల్లి దగ్గర వొదిలి పెట్టొచ్చిందాక తల్లి అరుస్తునే వుంది. ఎప్పుడు నిద్ర పట్టిందో తెల్లవారుజామున ఓ తోడెలు దొడ్డిముందు కొచ్చిందట. మేకలన్ని

బెదిరి అర్వగ మామయ్య దానిని ఊరవతలికి తరిమివచ్చాడట! వింటనే భయం వేసింది.

" మన ఊరు ఎట్లున్నది చెప్పవు, " అవును మన ఊళ్లో ఎవరింట్లా వున్నవు? పెద్దనాన్న ఇంట్లోనా చిన్న నాన్న ఇంట్లోనా?
" పోయే సరికి మధ్యాహ్నం అయింది. అప్పుడు ఊళ్లో ఎవరు లేరు. అందరు పనులమీద పోయింంద్రట.
" పనులకు పోంది వాళ్లకు పూట ఎట్లా గడుస్తదే " అన్నడు.
" పెద్దనాన్నె చెప్పులు కట్టుకుంటువున్నడు. ఇంటి ముందె చర్మాలను శుభ్రం చేసే గోలాలు, ఆసోర్రె వాసన. చినాన్నఏమో కంపకట్టెకొట్టి బొగ్గుబట్టీలు పెట్టడానికి పోయిండట. పిన్ని గూడ అయన్మెటేనట. సాయంత్రం గాని రాలేదు. అవును పెద్దనాన్న అన్నడు మీ నాన్నగూడ అదె పనిచేసేవాడటగ " ఏదో రహస్యన్ని కనిపెట్టినట్టు చూస్తు అడిగింది.
" ఆ రోజుల్లో మానాన్నెకాదు మనవాళ్లదంరు ఆపనులే చేసేవాళ్లు. రానురాను ఆ పనులన్నీ మిషన్స్ చేస్తున్నాయి. బాటా కంపెనీ వాడు బడా వ్యాపారి అయిపోపాయే గదా?"
" పెదనాన్న ఇల్లు ఇల్లులాగ లేదు కమ్మలగుడిసె. ఆ గుడిసెలో మెసలరాదు. చిన్ననాన్నది కాస్త పెద్దగుంది. చిన్న నాన్నకు అందరు ఆడపిల్లలే. వాళ్లతోనే ఆడుకున్న. పెద్ద ఈతచాప పరిచింది. ఆ రాత్రి అందరం అందులోనే పడుకున్నం."
" పడుకున్నరు బాగానేవుందిగాని తెల్లారె సరకి నీ బిడ్డనెత్తంతా పుచ్చిపోయిందనుకో. పొద్దున దువ్వితే పేలే పేలు!" అంది అమ్మమ్మ పరండాలోకి వస్తు.
" అసలు అక్క చెల్లళ్ల తలకు సరిగా నూనె అంటుకోనట్టుంది నాన్న."
" అంటుకుంటె వాళ్ల తలవెంట్రుకలు పల్లబారి గడ్డిగడ్డిగా ఎందుకుంటయి " అంది అమ్మమ్మ కలుగజేసుకుంటు.
" రోజు కూలి బట్ట పొట్టకే సరిపోవాయె ఇక వాళ్లు మిగతావి ఏం పట్టించుకుంటరు రజని. అదె చూడు పేదరికం అంటే" అన్నడు రాజరాం. చూసిన దానిని మళ్లీ గుర్తు చేసినట్టు.
" అత్తయ్య ఊళ్లో ఓ తక్కువ కులపు వ్యక్తి ఎక్కువ కులం అమ్మాయికి ప్రేమిస్తే. ఇక ఊరంతా ఒక్కటై ఆయన్ను చెట్టుకు కట్టేసి కొట్టింది చెపితిగదా " అంటు ఆనాటి సంఘటనను గుర్తు చేసుకున్నట్టు చూసింది.

" వాళ్ల ఆహంకారం అంతే కొడతరు. ఇంకా చంపుతరుగూడ ఎంతమందిని చంపలేదు "

" ఇదైతే మరి గోరం నాన్న " అంది అన్యాయం జరిగిపోయిందన్నట్లు చూస్తు.

" ఏమిటా ఘోరం " అంటు అప్పుడె వచ్చాడు సుందర్‌రావు.

సుందర్‌రావు గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేస్తువుంటాడు. రాజరాంకు మంచి మిత్రుడు. ఇద్దరి వయస్సు ఒక్కటై ఇద్దరి అభిరుచులు, ఆలోచనలూ ఒక్కటే.

" మా అమ్మాయి ఊళ్లు తిరుగొచ్చింది. అక్కడి జరిగె అన్యాయాల గురించి, పేరుకుపోయిన పేదరికం గురించి చెబుతుంది"

" పేదరికం పోవాలంటే దేశ సంపదను పెంచాలి. అందరికి అందేటట్లు పంచాలి. అదే కదా సోషలిజం అంటే" అన్నడు సుందర్‌రావు. అప్పుడు ఆయనకు మార్క్స్, నెహ్రూ గుర్తొచ్చాడు.

" అది సరే ముందు ఈకుల అవమానాలు, అణిచివేతలు పోవాలి. అందరికి చదువు అందాలి. అందరు చదువుకున్న నాడు ఈసమస్యలు వాటంతట అవే సమసిపోతయి. సామాజిక న్యాయం చోటు చేసుకుంటుంది. అన్నడు రాజారాం.

" అధికారుల సంతానం పైకొచ్చిన వర్గం వారి సంతానం, కులం పేరుతో రిజర్వేషన్స్ కాజేయకుండా అసలు బాధితులకు సహకరించాలి. కులం పేరుతో ఎదిగిన వాళ్ళే అవకాశల్ని ఎగురేసుకుపోకూడదు." అన్నడు సుందర్‌రావు.

" తెలిసిన వాళ్లు తెలివైన వాళ్ళు, ఆర్థికంగా వెనుకబడిన వాళ్ళు అణిచివేయబడుతు కూలి, నాలితో బ్రతుకెవాళ్ళకోసం కల్పించిన సౌకర్యాలను హైజాక్ చేయడం గురించి ఎప్పటి నుండో ఆలోచిస్తున్న " అన్నడు రాజారాం.

" విషయం తెలిసి జరుగుతున్నది చూస్తు నోరు మెదపకుండా ఉండడం కూడా ఓద్రోహం కిందే లెక్క" అన్నడు సుందర్‌రావు.

" మీరు ఒకరిద్దరు ఆలోచిస్తూ కూర్చుంటే సరిపోదు. అందరూ ఆలోచించే విధంగా చూడాలి. కాఫీపొడి నిండుకుంది. భూస్ట్ తీసుకోండి అంటు చెరొ కప్పును అందించింది." జానకి.

● జూలై 2005